మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం

జీడిమెట్ల: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ధూంలాతండాకు చెందిన ప్రవీణ్ నిజామాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడిసిన్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో హార్ట్ టూ హెల్స్ చారిటీ ద్వారా ఈ విషయం తెలుసుకున్న దాతలు జి.శ్రీనివాస్ ఎలక్ట్రికల్ డీఈ, లింగారావు వ్యాపారవేత్త ప్రవీణ్‌కు సోమవారం రూ.30 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రవీణ్ మెడిసిన్ పూర్తయ్యేవరకు ఏటా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ లక్ష్మీదేవి, రమేశ్, శ్రీనివాస్‌రావు, డిపిరావు, సామ్య నాయక్ పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలి



పద్మశాలీ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న బాబురావు తదితరులు

సుభాష్‌నగర్: పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యునైటెడ్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మేడం బాబురావు అన్నారు. సూరారం కాలనీలో నూతనంగా నిర్మించిన మార్కండేయ సంఘం భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ ప్రెసిడెంట్ కంది శ్రీరాములు, కుత్బుల్లాపూర్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తర్వాత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి

పోచారం: ఉద్యోగ విరమణ తర్వాత సంతోషంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ సి.ఉమాగౌరి అన్నారు. నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 హోదాతో ఉద్యోగ విరమణ చేసిన క్లెం కిష్టయ్యకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో నిబద్ధతతో పనిచేసిన కిష్టయ్య ఎంతో అభినందనీయులన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవితం గడాలని ఆకాంక్షించారు. అనంతరం కిష్టయ్య, సుధామాధురి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కీసర డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, నారపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శోభన, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీత, సూపర్‌వైజర్ భోగి ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

– కుత్బుల్లాపూర్ జోన్ బృందం



నిజాంపేట్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెంకట్రామిరెడ్డినగర్ ఈద్గా వద్ద..



గాంధీనగర్‌లో ముస్లిం పెద్దలతో కార్పొరేటర్..



ముస్లింలతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి



సుభాష్‌నగర్‌లో ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి



గాజులరామారంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి..



దేవేందర్‌నగర్‌లో అబీద్ ఆధ్వర్యంలో..



డీపోచంపల్లిలోని ఈద్గాలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి..

టార్గెట్‌కు మించి ఆస్తి పన్ను వసూళ్లు

- రూ.57.20 కోట్లతో కుత్బుల్లాపూర్ సర్కిల్ రికార్డు
- లక్ష్యం రూ. 54.36 కోట్లు.. అదనంగా రూ 2.84 కోట్ల వసూలు

కుత్బుల్లాపూర్: ఆస్తి పన్ను వసూళ్లలో కుత్బుల్లాపూర్ సర్కిల్ కొత్త రికార్డు సృష్టించింది. టార్గెట్‌కు మించి రూ.2.84 కోట్ల ఆదాయం అదనంగా వసూలైంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ 2023–24 ఆస్తి పన్ను రూ.51.61 కోట్లు ఉండగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.54.36 కోట్లుగా నిర్ణయించారు. అయితే బకాయిలతో కలిసి అంచనాలకు మించి లక్ష్యానికి అదనంగా రూ.2.84 కోట్లు వసూలై రూ.57,20 కోట్లకు చేరింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ గ్రేటర్‌లో విలీనమైన తర్వాత ఇంత మొత్తంలో ఆస్తి పన్ను వసూలు కావడం రికార్డుగా అధికారులు పేర్కొంటున్నారు.

అసంపూర్తి పనులు.. అవస్థలు..!

రంగారెడ్డినగర్: భూగర్భ విద్యుత్ కేబుల్ లైన్ కోసం తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ ఇందిరాగాంధీనగర్‌ను ఆనుకుని ప్రధాన రోడ్డుపై ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు అండర్ గ్రౌండ్ కేబుల్ లైన్ ఏర్పాటు చేశారు. పనుల పూర్తయినా గుంతలు సరిగా పూడ్చకుండా వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు గుంతను గమనించక అందులో పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అసంపూర్తిగా వదిలేసిన గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఇందిరాగాంధీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వెనుక గుంత

చలివేంద్రాల ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మేడ శ్రీనివాస్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఎన్ఎంసీ 22వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేడ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం పూర్తయ్యే వరకు చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆంజనేయ వర్మ, నాగేశ్వరరావు, భవానీప్రసాద్, వేణు, శ్రీకాంత్, శ్రీను, సింహాచలం, రామకృష్ణ, రమేశ్, బసవపునయ్య, కృష్ణారావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ భరత్‌కుమార్

మనం లైఫ్ సేవర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ..

సుభాష్‌నగర్: మనం లైఫ్ సేవర్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో తెలుగు తల్లినగర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సూరారం సీఐ భరత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సై లీమాగారు , బస్తీవాసులు తారాసింగ్, శ్రీనివాస్ గౌడ్ , నారాయణ, కరాటే శీను, రాధాకృష్ణ, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, నిరంజన్, రాజుగా, యాదగిరి , శ్రీను పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటానని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పీవీ ఎన్‌క్లేవ్, సమతానగర్‌లోని స్నేహ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 60వ పెళ్లి రోజు చేసుకున్న సీనియర్ సిటిజన్ జంట అప్కారి సూర్యప్రకాశ్ దంపతులతో కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించారు. అనంతరం 80వ బర్త్‌డే చేసుకున్న రేకల శ్యామ్ సుందర్‌రావుతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నర్సింహాయాదవ్ మాట్లాడుతూ.. మొక్కగా మొదలైన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మహావృక్షంగా ఎదిగి కుర్రాకారుల్లాగా పని చేస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, జనరల్ సెక్రటరీ సూర్యప్రకాశ్, సెక్రటరీ సుధాకర్ రావు, సత్తయ్య, విద్యాసాగర్, అమృతరావు, విజయ కుమార్, బక్కరెడ్డి, లింగం, మల్లేశ్‌యాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో సీనియర్ సిటిజన్స్, కార్పొరేటర్ నర్సింహాయాదవ్

మౌలిక వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కొలన్ హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత వారం జర్నలిస్ట్ కాలనీ మారుతీ ఎలైట్ వాసులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు సోమవారం కాలనీలో పర్యటించారు. కమిషనర్‌తో మాట్లాడి స్థానిక సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టీకుల ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, పితాని శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

పేకాటస్థావరంపై దాడులు

కుత్బుల్లాపూర్: పేకాట స్థావరంపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడులు చేసి 8 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని స్కైలీవ్ అపార్ట్‌మెంట్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అడ్డాపై దాడులు నిర్వహించారు. 8 మంది పేకాడుతూ పట్టుబడగా వారి నుంచి రూ.27,600, ఆన్‌లైన్‌లో రూ.19,200 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి వారిని స్టేషన్‌కు తరలించారు.

‘విద్యార్థుల అరెస్టు అన్యాయం’

ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వీరమల్ల కేశవరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1974లో 2300 ఎకరాల విస్తీర్ణంలో విశ్వవిద్యాలయం స్థాపించారన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు ఈ యూనివర్సిటీ భూములు విక్రయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భూముల విక్రయాన్ని శేరిలింగంపల్లి ప్రజలు, విద్యార్థులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని, వారికి అండగా పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

అర్ధరాత్రి అరగంటే..!

- పర్వత్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లైన్‌లో సమయపాలన లేకుండా నీటి సరఫరా
- అదికూడా లోప్రెషర్‌తో..
- ఇబ్బందుల్లో స్థానికులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లైన్‌లో నీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయపాలన లేకుండా రాత్రివేళల్లో 10 నుంచి 12 గంటల ప్రాంతంలో అది కూడా లోప్రెషర్‌తో సరఫరా చేస్తున్నారు. హైప్రెషర్‌తో పాటు నీటి సరఫరా సమయం పెంచాలని ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. సాధారణంగా గంటపాటు సరఫరా అయ్యే తాగు నీరు అరగంట మాత్రమే వదులుతున్నారు. అంతేగాకుండా కలుషితమైన నీరు సరఫరా కావడంతో శుద్ధజలం మురుగునీరుగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమయపాలన లేకుండా నీటి సరఫరా..

సమయపాలన లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నారని వాపోతున్నారు. దీంతో అటు పనికి వెళ్లలేక, ఇటు నీటిని పట్టుకోలేక, రాత్రి వేళల్లో జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్ధిష్ట సమయంలో సక్రమంగా నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. కలుషిత నీరు రాకుండా శాశ్వత చర్యలు చేపటాలని ప్రజలు కోరుతున్నారు.

రోగమొస్తే.. ఆస్తులు అమ్ముకోవాల్సిందే..

కాలమేదైనా సరే.. సీజన్ మారితే చాలు ఆస్పత్రులకు క్యూ కట్టాల్సి వస్తోంది. వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే అరకొర సౌకర్యాలు వెంటాడుతున్నాయి. మందులు ఉండవు.. టెస్టులు చేయరు.. దీని కోసం మళ్లీ మెడికల్స్, ప్రైవేటు దయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయించాల్సిందే.. ఈ అవస్థల నుంచి తప్పించుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అందులోకి వెళ్లి వచ్చే సరికి జేబు ఖాళీ అవుతోందే తప్ప రోగాలు నయం కావడం లేదు. దానికి కారణం అనుమతులు లేని ఆస్పత్రులతో పాటు అవగాహన లేని వైద్యులే అని పలువురు ఆరోపిస్తున్నారు. పుట్టగొడుగుల్లా అనుమతులు లేని క్లినిక్‌లు వెలుస్తున్నా వైద్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



- నిఘా లేక ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ
- అనుమతులు లేని దవాఖానాలు వందల సంఖ్యలో..
- అవగాహన లేకుండా వైద్యం చేస్తున్న వైనం
- రోగుల నుంచి ఇష్టానుసారంగా వసూళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రోగుల అటెండర్స్
- చర్యలకు సిద్ధమైన జిల్లా వైద్యారోగ్యశాఖ

ఆ ఆస్పత్రులపై చర్యలు తప్పవు



ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా జిల్లాలో పలు ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేయటంతో పాటు మరి కొన్నింటికి నోటీసులు జారీ చేశాం. ప్రభుత్వ నిబంధలు, ప్రమాణాలు పాటించని పలు ప్రైవేట్ ఆస్పత్రులపై విచారణ జరుగుతోంది. వసతులు లేకుండానే ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఉమాగౌరీ, జిల్లా వైద్యాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి.



సాక్షి, సిటీబ్యూరో: సేవ ముసుగులో అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, దయాగ్నస్టిక్ సెంటర్లు రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. కేవలం ధనార్జనే ధ్యేయంగా పని చేస్తూ రోగుల పాలిట శాపంగా మారుతున్నాయి. నిపుణులైన వైద్యులు లేకపోవడంతో పలువురు రోగులు మృత్యువాత పడుతున్నారు. అలాంటి ఘటనలు జరిగినప్పుడు హడావుడి చేస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారులు ఆ తర్వాత మామూళ్ల మత్తులో జోగుతున్నారు. రోగులు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసింది. వసతులు, ప్రమాణాలు లేకుండా నిర్వహిస్తున్న వాటిపై కొరడా ఝులిపిస్తోంది. అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డెంటల్, ఐ క్లినిక్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లు, స్కానింగ్, దయాగ్నోస్టిక్ సెంటర్లతో పాటు అర్హత లేని డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందిని గుర్తించి తక్షణ చర్యలకు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 20 ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టిన వైద్యశాఖ ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులను సీజ్ చేయడంతో పాటు కొన్ని ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

ప్రైవేట్ ఆస్పత్రులివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,600లకుపైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ గుర్తించింది. ఇందులో వంద కంటే ఎక్కువ బెడ్స్ ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 బెడ్ల వరకు ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నాయి. 20 బెడ్స్‌లోపు ఉన్న ఆస్పత్రులు 294, పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, దయాగ్నోస్టిక్ సెంటర్లు 712, డెంటల్ ఆస్పత్రులు 180, ఫిజియోథెరపీ సెంటర్లు 46, రీహాబిలిటేషన్ సెంటర్లు 8 ఉన్నాయి. జిల్లాలో అనుమతులు ఉన్న స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా, అనుమతి లేనివి 400 వరకు ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ పేర్కొంటోంది. ఈ ప్రైవేట్ ఆస్పత్రుల్లో జనరల్ ఫిజీషియన్లు, పీడియాట్రిక్, గైనకాలజిస్టులు తదితర వైద్య నిపుణులు ఉన్నారంటూ బోర్డులు, ప్రచార కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దానికి తోడు అన్నీ తామై డబ్బుల కోసం శస్త్రచికిత్సలు సైతం నిర్వహిస్తున్నారు.

నిర్లక్ష్యంతో నిర్వహణ..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో చెలగాటం ఆడుతున్నట్లు తనిఖీల్లో తేటతెల్లమవుతున్నట్లు తెలుస్తోంది. ఫీజుల వసూళ్లలోనూ ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అవసరానికి మించి వైద్యపరీక్షలు చేయడంతో పరోక్ష దోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆస్పత్రి నిర్వహించరాదని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ.. కొందరు పట్టించుకోవడం లేదు.

ఇక రేషన్‌షాపుల్లో సన్న బియ్యం!

- బాలానగర్ సర్కిల్ పరిధిలో నేటి నుంచే పంపిణీ ప్రారంభం
- మొత్తం 2,04,433 రేషన్ కార్డుదారులకు లబ్ధి



కుత్బుల్లాపూర్: అధికారంలోకి వస్తే సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరే సమయం ఆసన్నమైంది. ఉగాది రోజున సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఈనెల 1 నుంచి అన్ని రేషన్ షాపుల్లో పంపిణీ చేసేందుకు 50 క్వింటాళ్ల చొప్పున ప్రతి దుకాణంలో అందుబాటులో ఉంచారు. బాలానగర్ సర్కిల్ పరిధిలో కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 121, 122 ,123, 124 వార్డులు రాగా ఇక్కడ మొత్తం 33 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 114, 115, 116, 117, 118, 119, 120 డివిజన్లు రాగా 83 రేషన్ దుకాణాలు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గపరిధిలో 125, 126, 127, 128, 129, 130 ,131, 132 ,133 మొత్తం 8 డివిజన్‌లో 110 రేషన్ షాపులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

1,65,865 కిలోల బియ్యం పంపిణీ

బాలానగర్ డివిజన్ పరిధిలో మొత్తం 2,04,433 రేషన్ కార్డుదారులు ఉండగా, 1,65,865 కిలోల సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పౌర సరఫరాల శాఖ అధికారులు 50 క్వింటాళ్ల చొప్పున బియ్యాన్ని ఆయా దుకాణాలకు సరఫరా చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. డీలర్లకు పలు సూచనలు చేసి ఏమైనా ఆరోపణలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.